క్లుప్తంగా

ఒకరికి గాయాలు

పరకాల : పశువులను ఇష్టారాజ్యంగా రోడ్లపైకి వదిలిపెట్టడంతో పట్టణంలో రోజుకో చోట ప్రమాదం చోటుచేసుకుంటుంది. శుక్రవారం గేదె అడ్డురావడంతో ద్విచక్రవాహనంపై నుంచి పడిన ఓ యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. హనుమకొండ నుంచి పరకాలకు రాత్రి సమయంలో వస్తున్న నాగారం గ్రామానికి చెందిన పశువుల మహేందర్ రోడ్డుపైనా ఉన్న గేదె కనిపించకోవడంతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయకావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఆత్మకూరు : మండల కేంద్రం శివారులో గురువారం పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ సంతోష్ తెలిపారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన గుండె బోయిన శ్యామ్, కోల రాజు, వంచగిరి రాజేష్, ఎండి.ఫయాజ్, బయ్య దేవేందర్, వడ్డెపెల్లి వేణుగోపాల్, తక్కల్లపెల్లి చిరంజీవిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై పరమేశ్వర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన చెందిన ఊకంటి రాజిరెడ్డి, బిల్లా శ్రీనివాస్, లోకలబోయిన మల్లయ్య, అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. గురువారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కొడెపాక ఐలయ్య, కత్తెరశాల వీరన్న ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు.

సర్వే కిట్ల పంపిణీ




నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపట్టనుంది. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించిన కిట్లను ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ సర్వే ఎన్యుమరేటర్‌కు శుక్రవారం అందించారు. సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్‌కు కుటుంబ సభ్యుల వివరాలతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్, ధరణి పాస్‌బుక్, ఇతర గుర్తుపు కార్డులను చూపించి నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఎంపీఎస్ఓ సునీత, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

కిరీటం బహూకరణ



వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో గల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలోని శివలింగానికి గ్రామానికి చెందిన మామిడాల సంపత్-సువర్ణ దంపతులు శుక్రవారం కిరీటం, మాణిక్యాలు బహూకరించారు. అర్చకుడు భంగిమఠం స్వార్తీక్ శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కిరీటాన్ని, మాణిక్యాలను శివలింగానికి అలంకరించారు.

సన్మానం



శాయంపేట : మండలంలోని విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్‌పెక్టర్‌లుగా పనిచేస్తున్న బోడ జయేందర్ ఉద్యోగ విరమణ సన్మాన సభ గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగింది. జయేందర్ దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. అలాగే ఇటీవల బదిలీపై వెళ్లిన లైన్‌మెన్ సంతోష్, రామును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏడీఓ దేవేందర్ నాయక్ మాట్లాడారు. విధుల్లో అంకితభావంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉంటే వారి నుంచి గౌరవం పొందుతారని అన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మిగతా ఉద్యోగులు జయేందర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

ఇంటింటా వెలుగుల పండుగ

- అంబరాన్నంటిన దీపావళి సంబురాలు
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాలు
- బాణసంచాలు పేల్చిన చిన్నారులు



పరకాల : బాణసంచా కాల్చడంతో పట్టణంలోని ఓ దుకాణం ముందు విరజిమ్ముతున్న వెలుగులు



పరకాల : దీపాలు అలంకరిస్తున్న చిన్నారి

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇళ్లల్లో కేదారేశ్వరస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

శాయంపేట : మండలంలో దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేదారేశ్వర వ్రతాన్ని జరుపుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలు కూడా నోములకు తమ గ్రామాలకు చేరుకున్నారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకొన్నారు. ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించడంతో వెలుగులు విరజిమ్మాయి.

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయంలో దీపావళిని పురస్కరించుకుని గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కేదారీశ్వర వ్రతాలు, పూజలు చేపట్టారు. చిన్నారులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

ఎల్కతుర్తి : సిరుల పండుగ దీపావళిని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజలు గురువారం, శుక్రవారం ఇంటింటా ఘనంగా నిర్వహించుకున్నారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజులు చేశారు. ఇళ్లలో సిరులు విరజిల్లాలని కోరుకుంటూ అమ్మవారు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నోములున్న వారు కేదారీశ్వరస్వామిని తలుస్తూ నోచుకున్నారు. అనంతరం ఇంటిల్లిపాది బాణసంచాలు పేల్చి సంబురాలు చేసుకున్నారు.



ఐనవోలులో..



కమలాపూర్‌లో..



శాయంపేట : క్రకర్స్ కాల్చుతున్న కుటుంబ సభ్యులు



దామెర : పూజల్లో పాల్గొన్న మహిళలు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దీపావళి వేడుకలు గురు, శుక్రవారాల్లో ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో పాలవెల్లిని అలంకరించి భక్తి ప్రపత్తులతో కేదారీశ్వరస్వామిని నోముకున్నారు. అనంతరం బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

చేపలకు భలే గిరాకీ..

గౌరమ్మను కొలిచాక గంగమ్మను తినాలి అనేది అనాదిగా వస్తున్న సంప్రదాయం. దీంతో దీపావళి మరుసటి రోజు చేపలకు గిరాకీ బాగా పెరిగింది. ఈ సంప్రదాయాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు మత్స్యకారులు మండల కేంద్రంలో రెట్టింపు ధరలతో చేపలు విక్రయించారు. అయినప్పటికీ మండల ప్రజలు అధిక ధరలను లెక్కచేయకుండా చేపల కొనుగోలు చేశారు.

పరకాల : దీపావళి పర్వదినం వేడుకలను ప్రజలు సంబురంగా జరుపుకొన్నారు. ప్రతీ ఇంట దీపాలు వెలిగించడంతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించున్నారు. అదే విధంగా లక్ష్మీపూజ, కేదారేశ్వరస్వామి నోములు నోముకున్నారు.

దామెర : మండల వ్యాప్తంగా దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి లక్ష్మి పూజలు, కేదారేశ్వర వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పిండివంటలు తయారు నైవేద్యంగా సమర్పించారు.

ఓటుహక్కు వజ్రాయుధం

- ఆర్డీఓ డాక్టర్ నారాయణ

పరకాల : పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు చాలా కీలకమన్నారు. యువతపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని, అలాంటప్పుడు నచ్చిన నాయకుడిని కూడా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుంచుకోవాలని అన్నారు. అందుకే ఆయుధం వంటి ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. పరకాల నియోజకవర్గ నోడల్ అధికారి, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ భాస్కర్, డీటీ సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

దామెర : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ రాజేశ్‌కుమార్ తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించిన అండర్ 17 విభాగంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో జి.వైష్ణవి ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. నవంబర్ 3 నుంచి 4 వరకు మహబూబాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా ఎంపికైన వైష్ణవిని ఎంఈఓ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు.

హక్కుల సాధనకు ఏఐటీయూసీ పోరాటం

కమలాపూర్ : కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల కేంద్రంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సమీపంలో కొత్తకొండ సాంబయ్య అనే కార్మికుడు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజుగౌడ్ మాట్లాడుతూ.. ఏఐటీయూసీ గత 105 ఏళ్లుగా కార్మికుల పక్షాన ఎనలేని పోరాటాలు చేసి ఎన్నో హక్కులు సాధించిందన్నారు. అయినప్పటికీ మరొకొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాంమూర్తి, సీపీఐ మండల కార్యదర్శి ఓదెలు, నాయకులు మహేందర్, బాలరాజు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సాంబయ్య

మత్స్యకార్మికుల జీవనోపాధికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మత్స్యకార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు, వారికి జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. అవి ఎదిగే వరకు కార్మికులు ఓపిక పట్టాలని, మార్కెట్‌లో అమ్మకాలు అయ్యే విధంగా కార్మికులు సహకరించాలని అన్నారు. చలివాగు ప్రాజెక్టులో దళారీ వ్యవస్థ ఉండదని, గతంలో ఎమ్మెల్యే ప్రాజెక్టులో, చెరువుల్లో చేపపిల్లలను పోసి వ్యాపారం చేశాడని ఆరోపించారు. మండలంలో 75 చెరువులు, ఒక రిజర్వాయర్ ఉండగా రిజర్వాయర్‌లో మొదటి విడతలో 6లక్షల చేప పిల్లలను విడుదల చేస్తున్నామని, రెండో విడతలో మరో 6 లక్షల చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. చిన్న కుంటలో 6 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తామన్నారు.



చలివాగు ప్రాజెక్టులో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనాయణరావు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండలంలోని జోగంపల్లి, కొప్పుల, వసంతాపూర్, సూర్యనాయక్‌తండా, కాట్రపల్లి, ప్రగతిసింగారం, పత్తిపాక, మైలారం, గట్లకానిపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ప్రారంభించారు. తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఏకకాలంలో రెండు లక్షల పంట రుణమాఫీ అందని రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తే మార్చి 31లోగా రుణమాఫీ చేస్తామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దామెర : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి నుంచి (సిద్దాపూర్) హరిశ్చంద్రనాయక్‌తండా వరకు బీటీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.3 కోట్ల 4 లక్షల వ్యయంతో బీటీ రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అనంతరం ల్యాదెళ్లలోని శివాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కమలాపురం మండలం అంబాలకు చెందిన కుమ్మరి కొమురయ్య (54) బుధవారం ద్విచక్ర వాహనంపై నాగయ్యపల్లిలో జరిగే అంత్యక్రియలకు హాజరై తిరిగి అంబాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి ములుగు వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఆత్మకూరు శివారులో ఢీ కొట్టింది. దీంతో కొమురయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అతడు మృతిచెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన పట్టెం రాజు, అతడి స్నేహితుడు కోడెపాక ప్రశాంత్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌కు చెందిన పల్లంకొండ శ్రీనివాస్ వద్ద నుంచి అదే గ్రామానికి చెందిన పట్టెం రాజు సుమారు నాలుగు నెలల క్రితం తన అవసర నిమిత్తం రూ.7 వేలు తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే రేపు, మాపు అంటూ దాటవేస్తూ శ్రీనివాస్ ఫోన్ నంబరు బ్లాక్ లిస్టులో పెట్టాడు. ఆ తర్వాత దేవరాజు కుమారస్వామి అనే వ్యక్తితో కలిసి శ్రీనివాస్ గ్రామ పంచాయతీ వద్ద ఉండగా పట్టెం రాజు అతని స్నేహితుడు కోడెపాక ప్రశాంత్‌తో కలిసి అక్కడకు వచ్చి శ్రీనివాస్‌తో గొడవ పడి ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టాడు. అంతటితో ఆగకుండా ప్రశాంత్ అక్కడే ఉన్న బీరు సీసాతో శ్రీనివాస్‌పై దాడి చేసి దవడపై కొట్టగా గాయమైంది. మరోసారి డబ్బులు అడిగితే చంపుతామంటూ శ్రీనివాస్‌ను బెదిరింపులకు గురిచేశారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పట్టెం రాజు, కోడెపాక ప్రశాంత్ అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

నడికూడ : రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లపల్లికి చెందిన జీల్ల భిక్షపతి బైక్‌పై పరకాలకు వెళ్తున్నాడు. అదే క్రమంలో చౌటుపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై పరకాల నుంచి వస్తుండగా పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పిన ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఇరువురికి గాయాలు అవడంతో స్థానికులు వెంటనే పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీస్‌లు తెలిపారు.

పాత నిధులతో కొత్త శంకుస్థాపనలా..

దామెర : ప్రభుత్వం మారితే శిలాఫలకాలు మారుస్తారా, పాత నిధులతో కొత్తగా శంకస్థాపనలు చేస్తారా అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ ప్రశ్నించారు. మండలంలోని సింగరాజుపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గత సంవత్సరం ఎస్టీ ఎస్డీఫ్ నిధుల నుంచి రూ.3 కోట్ల 4 లక్షలు మంజూరు చేసి అక్టోబర్ 2న పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు పూర్తిచేయలేదని, గతంలో మంజూరైన పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడుతూ.. గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం పక్కనే మరోకటి ఏర్పాటు చేసి అందులో తమ పేర్లు లేకుండా దళితులను అవమానించారని ఆరోపించారు. మండల అభివృద్ధికి నూతనంగా నిధులు మంజూరు చేయాలని, పాత నిధులతో కొత్త పనులు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని మాజీ ఎంపీటీసీ కృపాకర్ రెడ్డి విమర్శించారు. జిల్లా నాయకులు కృష్ణమూర్తి, శంకర్, సంపత్, యూత్ అధ్యక్షుడు రాజు, రమేశ్, రాజు, కిరణ్, శరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మట్లాడుతున్న రాము

లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్ర పూజలు



మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం జరిపించారు. శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తైన అనంతరం ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్ర హారతి సమర్పించారు. ఆచార్యులు వేంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రత నియమాలు పాటించాలి

ఆత్మకూరు : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాలను జాతీయ రహదారి అధికారులు, రోడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జాతీయ రహదారిపై టీజంక్షన్ వద్ద స్పీడ్‌బ్రేకర్, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సై పరమేశ్వర్, డిప్యూటీ ఈఈ కిరణ్‌కుమార్, ఎన్‌హెచ్ ఏఈ చేతన్ ఉన్నారు.

బీసీ గురుకులంలో విద్యార్థుల సంబురాలు

- డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం

కమలాపూర్ : గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రవీందర్, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు కేక్ కట్‌చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో ఇక నుంచి తమకు మరింత నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష మేరకు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని దేశానికి చాటుతామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏటీపీ మంగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న ఎంజేపీ పాఠశాల విద్యార్థులు

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. వివిధ మండల కేంద్రాల్లో ఇందిరాగాంధీ వర్ధంతిని, దివంగత ఉపప్రధాని వల్లా భాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



ఎల్కతుర్తి : మండల కేంద్రంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో..



ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎల్కతుర్తి : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని రైతుసేవా పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్.వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు 17శాతం తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు, చెత్త లేకుండా చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. పాలకవర్గ సభ్యులు రఘు, నవీన్, కార్తిక్, ఉట్కూరి రాములు, రాజమొగిళి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని కన్నూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు గురువారం ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అన్నారు.